రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

కల్యాణం జరిపిస్తున్న ప్రధానార్చకుడు విజయరాఘవన్

భద్రాచలం, జనవరి 20: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలోని అంతరాలయంలో మూలవరులకు అర్చకులు శనివారం స్వర్ణ తులసి పూజలు చేశారు. నిత్య కల్యాణమూర్తులకు బేడా మండపంలో ప్రధానార్చకులు విజయరాఘవన్ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

సీతారామచంద్రస్వామికి నెక్లెస్ బహూకరణ

భద్రాచలం, జనవరి 20: భద్రాచలం సీతారామచంద్ర స్వామికి హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీనివాస్, ప్రదీప్, వారి కుటుంబీకులు కలిసి 35 గ్రాముల బంగారంతో చేయించిన నెక్లెస్‌ను శనివారం బహూకరించారు. రూ.2.40 లక్షల విలువైన దీనిని ఆలయ ఈవో రమాదేవికి అందించారు. వారు ముందుగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఎస్పీని కలిసిన హెచ్‌ఆర్‌సీఐ నాయకులు

ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న హెచ్‌ఆర్‌సీఐ సభ్యులు

రామవరం, జనవరి 20: ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ రోహిత్‌రాజును హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా (హెచ్‌ఆర్‌సీఐ) సభ్యులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమొక్క ఇచ్చి శాలువతో సత్కరించారు. స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరి కర్రి తాతారావు, కర్రి అపర్ణ, మాసుల అనూష, బైపెల్లి సుభద్ర, అరిక మంగమ్మ, బట్టు రమ, ముద్దమల్ల రోహిణి, మెరుగు అనసూయ, పులి మామిడి అంజనేయులు ఉన్నారు.

ఎస్పీని కలిసిన పీఏసీఎస్ వైస్ చైర్మన్

లక్ష్మీదేవిపల్లి, జనవరి 20 : జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బిరుదు రాజు రోహిత్‌రాజును కొత్తగూడెం పీఏసీఎస్ వైస్ చైర్మన్ కూచిపూడి జగన్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. ఆయనతోపాటు హేమచంద్రాపురం సర్పంచ్ బండ వెంకటేశ్వర్లు, గోలి శ్రీను, కల్లుగడ్డ సురేశ్, నగేశ్, విజయ్ పాల్గొన్నారు.

మండలంలో అదనపు కలెక్టర్ పర్యటన

ములకలపల్లి, జనవరి 20: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు శనివారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ పుల్లారావుతో కలిసి పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల నిర్వహణ, పోలింగ్‌కు సంబంధించి తహసీల్దార్‌కు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్ఐ తారాచంద్, వెంకటేశ్వర్లు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

రాములోరి దర్శనానికి స్పెషల్ రైళ్లు

పెద్దపల్లి, జనవరి 20(నమస్తే తెలంగాణ): అయోధ్య రామమందిరం ప్రారంభం, విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవం ఈ నెల 22న జరుగనుండగా, రైల్వే శాఖ తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది. ఈ నెల 29 నుంచి మార్చి 3వ తేదీ వరకు అయోధ్య ధాం రైల్వే జంక్షన్‌కు స్పెషల్ సర్వీసులు నడపాలని నిర్ణయించింది.

కాజీపేట జంక్షన్ పరిధిలో..

కాజీపేట నుంచి అయోధ్య ధాం జంక్షన్ రైల్వే స్టేషన్‌కు రైలు నంబర్ (07223) ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 28వరకు వారంలో మూడు రోజులు (మొత్తం 15ట్రిప్‌లు) నడుస్తాయి. జనవరి 30, ఫిబ్రవరి 1, 3, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 తేదీల్లో ఖాజీపేట జంక్షన్ నుంచి సాయంత్రం 06:20 గంటలకు బయలుదేరుతుంది. అయోధ్య జంక్షన్ నుంచి ఫిబ్రవరి 2, 4, 6, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29 తేదీల్లో, మార్చి 2న (మొత్తం15 ట్రిప్‌లు) నడుస్తాయి. ఇది అయోధ్య నుంచి మధ్యాహ్నం 2:20 గంటలకు బయలు దేరి మరుసటి రోజు రాత్రి 9 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుంది.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **ఇల్లందు బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **రాటకొండ రాధాకృష్ణ** S/o:రాటకొండ నరసింహారావు, వయస్సు : 53సం||లు, వృత్తి : వ్యాపారం, నివాసం:ఇ.నెం.2-93/2, బస్వాపురం గ్రామం,సింగరేణి మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి :

ఖమ్మం రిజిస్ట్రేషన్ జిల్లా, ఇల్లందు సబ్ -రిజిస్ట్రారు గారి అధికార పరిధిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు మండలం, ఇల్లందు మున్సిపాలిటీ, మెయిన్ రోడ్డు (మార్కెట్‌కు ఎదురుగా) పరిధిలో గల సర్వే నెం. 609, ఇంటి నెం. 1-3-189 నకు సంబంధించిన మొత్తం విస్తీర్ణము : 99.00 చ||గ|| లేదా 82.77 చ||మీ|| **డాక్యుమెంట్ నెం.117/2022**, అందు గల జి.ఐ.షీట్స్ షాపు యొక్క కట్టుబడి విస్తీర్ణము : 297.36 చ||అ||,(ఇట్టి ఇంటి మొక్క అసెస్‌మెంట్ నెం. పి.టిన్.నెం. 1109000396) గల స్థిరాస్తికకు హద్దులు **తూర్పు :** శ్రీ రాటకొండ రాధాకృష్ణ గారి జి.ఐ.షీట్స్ షాపు (ఇంటి నెం.1-3-189/1), **పడమర :** శ్రీ ఒరుగంటి ప్రసాద్ గారి ఎసి షీట్స్ షాపు (ఇంటి నెం. 1-3-188), **ఉత్తరం :** మున్సిపాలిటి రోడ్డు, **దక్షిణము :** మెయిన్ రోడ్డు (ఇల్లందు నుండి కొత్తగూడెం వెళ్ళు రోడ్డు).

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

ప్రణాళిక గ్రామ సభలు వెలవెల

అశ్వారావుపేట టౌన్, జనవరి 20 : కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అందించే ప్రత్యేక నిధులతో చేపట్టే అభివృద్ధి పనులలో భాగంగా 2024-2025 ఆర్థిక సంవత్సరానికి పనులు గుర్తించేందుకు శనివారం నిర్వహించిన గ్రామ సభలు జనంలేక వెలవెలబోయాయి. మేజర్ పంచాయతీతోపాటు పలు పంచాయతీలలో గ్రామ సభలు జరిగాయి. అధికారులే గ్రామాభివృద్ధిలో భాగంగా పనుల వివరాలను సేకరించేపనిలో ఉన్నారు. ఈ గ్రామ సభకు ఉపసర్పంచ్ రేమళ్ల కేధర్ నాథ్ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
Classifieds

EDUCATION

★Admissions: రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, M.Tech, D-Pharma, B.Pharma, B.Sc. (Agri.), B.Sc. (Nursing), B.Ed, B.Ped, MBA, MCA. Eligible for all Jobs. Ph: 8866977112, 339.
NT-319803-All

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319418-All

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ప్రమాద రహిత సింగరేణి కోసం కృషి చేయాలి

భద్రతా చర్యలపై రివ్యూ సమావేశంలో డైరెక్టర్లు

రివ్యూ సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్లు

కొత్తగూడెం సింగరేణి, జనవరి 20: సింగరేణి వ్యాప్తంగా పని ప్రదేశాల్లో రక్షణ సూత్రాలు పాటించాలని, ప్రమాద రహిత సింగరేణిగా తీర్చిదిద్దేందుకు అధికారులు, కార్మికులు కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు, డైరెక్టర్ (ఓపీ) ఎన్‌వీకే శ్రీనివాస్ అన్నారు. సింగరేణి సంస్థ కార్పొరేట్ ఏరియాలోని ఇల్లెందు క్లబ్‌లో శనివారం అంతర్గత భద్రతా విభాగం ఆధ్వర్యంలో రక్షణ చర్యలపై సేఫ్టీ రివ్యూ సమావేశం నిర్వహించారు. జీఎం (సేఫ్టీ) గురవయ్య, రీజినల్ సేఫ్టీ జీఎంలు కుమారస్వామి, సాంబయ్య, కేహెచ్‌ఎన్ గుప్తా, ఎస్‌వోటు డైరెక్టర్ (పీపీ) నాగేశ్వరరావు పాల్గొన్నారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల సేఫ్టీ అధికారులు, ఎస్ఎంటీసీ అధికారులు, కొత్తగూడెం రీజియన్ నుంచి అన్ని గనుల రక్షణ అధికారులు, అన్ని గనుల వర్క్‌షాప్‌ల ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులతో సమీక్షించారు. ప్రతి ఒక్క ఉద్యోగి సంస్థ భద్రతా సూత్రాలపై ఇచ్చే సర్క్యులర్‌పై అవగాహన కల్పిస్తూ రక్షణ చర్యలపై ప్రతి ఉద్యోగిని భాగస్వాములను చేయాలని, సింగరేణి సంస్థను ప్రమాదాలు లేని సంస్థగా తీర్చిదిద్ది కోలిండియా స్థాయిలో సింగరేణి సంస్థకు పేరు తీసుకురావాలని కోరారు. కొత్తగూడెం రీజియన్ సేఫ్టీ జీఎం కుమారస్వామి, రామగుండం రీజియన్ జీఎం సేఫ్టీ సాంబయ్య ఈ నెల పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా వారిని సన్మానించారు.

రేపు సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా

కొత్తగూడెం అర్బన్, జనవరి 20: సింగరేణి మాజీ కార్మికుల పట్ల యాజమాన్యం, ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని సింగరేణి రిటైర్డ్ కార్మికుల సంఘం రీజియన్ అధ్యక్షుడు మాతంగి లింగయ్య, కార్యదర్శి అన్నెం లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి మూడేళ్లకొకసారి పెన్షన్ విధానంపై సమీక్షించి ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22న హెడ్డాఫీస్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు దమ్మాలపాటి శేషయ్య, వంగ వెంకట్, గట్టయ్య పాల్గొన్నారు.

క్యాలెండర్ అవిష్కరించిన జీఎం

ఇల్లెందు రూరల్, జనవరి 20: జీఎం కార్యాలయంలో ఎస్టీ అసోసియేషన్ క్యాలెండర్‌ను సింగరేణి ఏరియా జీఎం జాన్ ఆనంద్ శనివారం అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ పురోగతికి ఎస్టీ అసోసియేషన్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం మల్లారపు మల్లయ్య, డీజీఎం పర్సనల్ మోహన్‌రావు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్: ఎమ్మెల్యే జారె

అశ్వారావుపేట/అశ్వారావుపేట రూరల్, జనవరి 20 : విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. శనివారం మండలంలోని నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏకో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చేసే పనికి సంబంధించి విద్యార్థులు శిక్షణ తీసుకోవడం ఎంతో అవసరమని, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మెలకువలు, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం వంటి అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీవరకు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ శిక్షణ కార్యక్రమాలు ఎంపిక చేసిన పాఠశాలల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం తరగతులకు వెళ్లిన ఎమ్మెల్యే విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్, జనవరి 20: ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మణుగూరు ప్రజాభవన్(ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం)లో అన్ని శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి పేదవారికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని అధికారులను ఆదేశించారు.

బాలల ఆరోగ్యంపై జాగ్రత్తలు తప్పనిసరి

అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు

కొత్తగూడెం టౌన్, జనవరి 20 : బాలల సంరక్షణతో పాటు వారి ఆరోగ్యం పట్ల తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైల్డ్ కేర్ ప్లాన్ కింద ప్రతి మూడునెలలకోసారి పిల్లల ఆరోగ్యం, వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలబాలికలకు స్కిల్‌డెవలప్‌మెంట్ పరంగా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా సంక్షేమాధికారి విజేత మాట్లాడుతూ ఏడుగురు బాల కార్మికులను రక్షించి బాలసదన్‌కు తరలించామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఇటలీకి ఇద్దరు, అమెరికాకు ఇద్దరు, ఇతర దేశాలకు 17మంది పిల్లల్ని కలెక్టర్ ఆధ్వర్యంలో దత్తత ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ విజయ్‌కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిర, మైనార్టీ వెల్ఫేర్ అధికారి సంజీవరావు, డీసీపీవో హరికుమారి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రవి, డబ్ల్యూసీ మెంబర్లు సుమిత్ర, అంబేద్కర్, సాధిక్‌పాషా, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నవోదయ ప్రవేశ పరీక్ష


కొత్తగూడెం ఎడ్యుకేషన్: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 20 : జవహర్ నవోదయ పాలేరులో 2024 -25 సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశం కోసం శనివారం జరిగిన ప్రవేశ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో వెంకటేశ్వరచారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 9 సెంటర్లు ఏర్పాట్లు చేయగా మొత్తం 1,325 మంది విద్యార్థులకు 1,045 మంది పరీక్షకు హాజరుకాగా 280మంది గైర్హాజరయ్యారు. జేఎన్‌వీఎస్ఈ, పాలేరు ఇన్‌చార్జి కేబ్రహ్మనందరెడ్డి, ఏసీజీఈ మాధవరావు, వివిధ సెంటర్లను సందర్శించారు.

ఇల్లెందు రూరల్..

ఇల్లెందు రూరల్, జనవరి 20 : మండలంలో నిర్వహించిన నవోదయ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. సింగరేణి పాఠశాలలో 192 మందికి 164 మంది విద్యార్థులు, జేబీఎస్ పాఠశాలలో 159 మందికి గాను 135 మంది హాజరైనట్లు ఎంఈవో పిల్లి శ్రీనివాస్‌రావు తెలిపారు. సింగరేణి పాఠశాల చీఫ్‌గా సూపరిన్‌టెండెంట్ టీవీఆర్ స్వామి, జేబీఎస్ పాఠశాలలో పీసీహెచ్ శర్మ చీఫ్‌గా పరీక్షలు నిర్వహించారన్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేట జనవరి 20 : శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షకు 86మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 71మంది హాజరైనట్లు పర్యవేక్షకులు ఎంఈవో పీ.కృష్ణయ్య, హెచ్‌ఎం పీ.హరిత తెలిపారు.

సవరణలు లేని ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

దమ్మపేట రూరల్: దరఖాస్తులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాంబాబు

అశ్వారావుపేట, జనవరి 20 : సవరణలు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు బీఎల్‌వోలను ఆదేశించారు. కొత్త ఓటు దరఖాస్తుతోపాటు చేర్పులు, మార్పుల కోసం వచ్చే ఓటర్లకు సహకరించాలన్నారు. మండలంలోని ఊట్లపల్లి, నారాయణపురం పోలింగ్ కేంద్రాల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న స్పెషల్ కాంపెయిన్ డేను శనివారం క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ, సవరణలపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ వి.కృష్ణ ప్రసాద్, నయాబ్ తహసీల్దార్ రామకృష్ణ, గిర్ధావర్ కృష్ణ ఉన్నారు.

దమ్మపేటలో...

దమ్మపేట రూరల్, జనవరి 20 : స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024లో భాగంగా మండలంలోని మల్కారంలో ఏర్పాటు చేసిన క్యాంపెయిన్‌ను శనివారం అదనపు కలెక్టర్ రాంబాబు పరిశీలించారు. ఓటు నమోదు, సవరణ చేసుకునే పద్ధతిపై అవగాహన కల్పించారు. ఆయన వెంట తహసీల్దార్ ముజాహిద్ ఉన్నారు.

ప్లాంటేషన్ పేరుతో ఆదివాసీ భూములు లాక్కోవద్దు

ములకలపల్లి, జనవరి 20: ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో ములకలపల్లి రేంజ్ పరిధిలో శనివారం అటవీ రేంజ్ అధికారి రవికిరణ్ సిబ్బందితో కలిసి వలస ఆదివాసీల సాగు భూములను పరిశీలించారు. ప్లాంటేషన్ ఏర్పాటుకు వెసులుబాటు, భూమి లభ్యతపై క్షేత్రస్థాయిలో పర్యటించారు. వలస ఆదివాసీల తరఫున ఆదివాసీ జీవన విధానం నాయకులు, జర్నలిస్టు పోతుగంటి క్రాంతి మాట్లాడుతూ ఆదివాసీల పంట భూములను ప్లాంటేషన్ల కోసం తీసుకోవడం తగదని ఫారెస్టు అధికారులను కోరారు.

వాహనదారులు భద్రతా నియమాలు పాటించాలి

చుంచుపల్లి, జనవరి 20: వాహనదారులు రోడ్డు ప్రమాదాలు జరగకుండా భద్రతా నియమాలు పాటించాలని జిల్లా రవాణాధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలు ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 19 నుంచి 22 వరకు పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 23 నుంచి 26 స్కూల్, కాలేజీల్లో వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. 27, 28 తేదీల్లో హెల్మెట్లపై అవగాన కల్పించేందుకు ర్యాలీ ఉంటుందని చెప్పారు.

డైరెక్టర్(పా)గా ఎన్‌వీకే శ్రీనివాస్

రామవరం, జనవరి 20 : సింగరేణి సంస్థలో డైరెక్టర్(పా)గా ఎన్‌వీకే శ్రీనివాస్‌ను నియమిస్తున్నట్లు సంస్థ సీఎండీ బలరాం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో డైరెక్టర్(పా)గా విధులు నిర్వహించిన బలరాం సీఎండీగా బాధ్యతలు చేపట్టడంతో పోస్టు ఖాళీ అయ్యింది. దీంతో ఆ స్థానంలో సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్‌వీకే శ్రీనివాస్‌ను నియమించారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

మణుగూరుటౌన్, జనవరి 20: ఈ నెల 26న జరిగే గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఏరియా జీఎం దుర్గం రామచందర్ సూచించారు. ఆయన శనివారం పీవీ కాలనీ భద్రాద్రి స్టేడియంలో గణతంత్ర వేడుకల కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గణతంత్ర వేడుకలను వీక్షించేందుకు వచ్చే విద్యార్థులకు ఏర్పాట్లు చేయాలని, తాగునీరు సదుపాయంతో పాటు టెంట్లు, కుర్చీలు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్వోటు జీఎం వీసం కృష్ణయ్య, ఏజీఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు, డీజీఎం(పర్సనల్) రమేష్, ఎస్ఈఈ(ఈఅండ్ఎం) శోభన్‌బాబు, ఈఈ(సివిల్) డీవీఎస్ఎన్.ప్రవీణ్, సివిల్ అధికారులు, సూపర్‌వైజర్లు అజయ్, ప్రసాద్ పాల్గొన్నారు.

'భరోసా' కేంద్రంలో ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం క్రైం, జనవరి 20 : భరోసా కేంద్రంలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం చేసేందుకు మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు శనివారం ఒక ప్రకటన పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మహిళా భరోసా కేంద్రానికి కాంట్రాక్ట్ ప్రతిపాదికన మహిళా అభ్యర్థుల నియామకాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తగూడెం భరోసా కేంద్రంలో పని చేసేందుకు రిసెప్షనిస్ట్(1), సపోర్ట్‌పర్సన్(2), లీగల్ సపోర్ట్‌పర్సన్(1), మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఏఎన్ఎం(1) పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. సర్వీస్ రెగ్యులరైజేషన్ హక్కులు లేకుండా కాంట్రాక్ట్ ప్రాతిపదికన భరోసా సెంటర్ కోసం మహిళా ఉద్యోగులను భర్తీ చేయడం జరుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఉద్యోగం ఒక సంవత్సర కాల వ్యవధి మాత్రమేనని, అనంతరం అదే కాలవ్యవధి ఆవశ్యకత, బడ్జెట్ ప్రకారం ప్రతి సంవత్సరం పొడిగించబడుతుందన్నారు. బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ వంటి తగిన పత్రాలన్ని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని ఇన్‌వార్డ్ సెక్షన్‌లో అందించాలని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు వచ్చే నెల 1వ తేదీ సాయంత్రం 5గంటల వరకు సమయం ఉందన్నారు. ఈ ప్రక్రియను ఏఆర్ అదనపు ఎస్పీ(అడ్మిన్) ఈ. విజయ్‌బాబు ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. పూర్తి సమాచారం కోసం షీ టీమ్ ఎస్సై రమాదేవి 8712682131 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మైనార్టీ పాఠశాల, కళాశాలలో ప్రవేశానికి ఆహ్వానం

భద్రాచలం, జనవరి 20: పట్టణంలోని తెలంగాణ మైనార్టీ పాఠశాల/కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రమేష్ లాల్ హట్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ముస్లిం విద్యార్థులకు 28, ఇతర మైనార్టీలకు 2, ఎస్సీలకు 2, ఎస్టీలకు 5, బీసీలకు 1 సీట్లు ఉన్నాయని వివరించారు. 6 నుంచి 8వ తరగతి వరకు ఉన్న బ్యాగ్‌లాగ్ మైనార్టీ సీట్లను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం హెచ్ఈసీ, సీఈసీలో 80 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో మైనార్టీలకు 60, ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, బీసీలకు 10, ఓపెన్ కేటగిరీలో 2 సీట్లు ఉన్నట్లు వివరించారు. htttps://tmresitelangana.cgg.gov.in/ ద్వారాగానీ, TMREIS మొబైల్ యాప్ ద్వారాగానీ, నేరుగా పాఠశాల/కళాశాలలోగానీ దరఖాస్తు చేసుకోవ్వని తెలిపారు. మైనార్టీయేతర విద్యార్థులకు లక్కీ డిప్ ద్వారా అడ్మిషన్ ఉంటుందన్నారు. వివరాలకు 94933 34736, 94903 65635, 63007 08074 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

కిన్నెరసాని కాలువలో పడి యువకుడు మృతి

పాల్వంచ, జనవరి 20 : మండల పరిధిలోని కరకవాగు గ్రామం సమీపంలో ఉన్న కిన్నెరసాని కాలువలో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన నలుగురు యువకుల్లో ఒకరు దుర్మరణం పాలైన ఘటన శనివారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం... లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన బోడ అజయ్(17), అజ్మీరా గురునాథ్, బానోత్ విష్ణు, భూక్యా ప్రశాంత్ పాల్వంచ పట్టణంలోని కేటీపీఎస్‌కు వచ్చే కిన్నెరసాని కాలువలో కరకవాగు వద్ద ఈత కొడుతున్నారు. ఎక్కువ లోతు ఉన్న ప్రదేశంలోకి అజయ్ దూకాడు. ఎంతసేపటికీ బయటికి రాకపోవడంతో మిగిలినవారు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి అజయ్‌ను బయటికి తీసేసరికి అప్పటికే అజయ్ మృతిచెందాడు. మృతుడు కొత్తగూడెంలోని శ్రీనివాస ఐటీఐలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. బానోత్ విష్ణు శుక్రవారం శబరిమలైకి వెళ్లి తిరిగి వచ్చిన తర్వాత శనివారం స్నేహితులతో కలిసి ఈతకొచ్చారు. ఈతకొచ్చిన వారిలో తమ స్నేహితుడు మృతి చెందడంతో వారు బోరున విలపించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పాల్వంచ పట్టణ ఎస్సై రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక ఆకస్మిక మృతి

పర్ణశాల, జనవరి 20: ఓ బాలిక ఆకస్మికంగా మృతిచెందింది. దుమ్ముగూడెం మం డలం గౌరవరం గ్రామానికి చెందిన మట్ట అనూష(17), 20 రోజుల క్రితం తన తల్లిదండ్రులతో కలిసి పత్తి చేనులో కూలి పనులకు వెళ్లింది. అక్కడ ఆమె ఒక్కసారిగా కుప్పకూలింది. తల్లిదండ్రులు వెంటనే భద్రాచలం ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆమె అక్కడే శనివారం మృతిచెందింది. ఆమె దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం విద్యార్థిని.

మట్టి ట్రాక్టర్లు, జేసీబీ సీజ్

దమ్మపేట రూరల్, జనవరి 20 : అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టరును తహసీల్దార్ ముజాహిద్ సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని దురదపాటు శివారులో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టరును, జేసీబీని పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

అసాంఘిక శక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు

పినపాక, జనవరి 20: అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించవద్దని వలస ఆదివాసీలకు ఈబయ్యారం సీఐ శివప్రసాద్ సూచించారు. ఆయన శనివారం మండలంలోని వలస ఆదివాసీ గ్రామమైన ఉమేష్‌చంద్రనగర్ ఆదివాసీలతో మాట్లాడారు. వలస ఆదివాసీ గ్రామాలకు ఎవరైనా కొత్తవారు వస్తే వెంటనే దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సంఘ విద్రోహ శక్తులకు ఆశ్రయం కల్పిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పట్టభద్రులు ఓటు కోసం దరఖాస్తు చేసుకోండి

చంద్రుగొండ, జనవరి 20: పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటుహక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ఎల్.ప్రసన్న పిలుపునిచ్చారు. శనివారం మండల రెవెన్యూ కార్యాలయంలో పట్టభద్రుల నుంచి దరఖాస్తులను ఆమె స్వయంగా స్వీకరించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

29న ఎస్ఎంసీ ఎన్నికలు

అన్నపురెడ్డిపల్లి, జనవరి 20 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 29న స్కూల్ మేనేజ్‌మెంట్(ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈవో సత్యానారాయణ తెలిపారు. శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎన్నికల ప్రకటన షెడ్యూల్‌ను విడుదల చేశారు. మండలంలోని 32 ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఎంఈవో తెలిపారు.

లైఫ్ సర్టిఫికెట్ క్యాంప్ ప్రారంభం

భద్రాచలం, జనవరి 20: పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో లైఫ్ సర్టిఫికెట్ క్యాంప్‌ను శనివారం ప్రారంభించినట్లు అధ్యక్షుడు జి.భూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది మార్చి నెలాఖరు వరకు ఉంటుందని పేర్కొన్నారు. పెన్షనర్లు తమ పీపీఓ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్, ఆధార్ కార్డుతో వచ్చి లైఫ్ సర్టిఫికెట్ తీసుకోవచ్చని వివరించారు.

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీవో

ఇల్లెందు రూరల్, జనవరి 20 : మండలంలోని పలు గ్రామాల్లో నర్సరీలను ఎంపీడీవో బాలరాజు శనివారం పరిశీలించారు. ఇందిరానగర్, బాలజీనగర్, సుభాష్‌నగర్‌తో పాటు పలు గ్రామ పంచాయతీలలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన నర్సరీలను పరిశీలించారు. పిచ్చి మొక్కలు పెరిగితే వెంటనే తొలగించాలని సూచించారు.

ఓటు నమోదు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

అశ్వారావుపేట టౌన్, జనవరి 20: ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నయాబ్ తహసీల్దార్ సుచిత్ర సూచించారు. శనివారం రింగ్ రోడ్డులోని ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌లలో బీఎల్‌వోలతో ప్రత్యేక ఓటు నమోదు శిబిరం నిర్వహించారు. శిభిరంలో మురళీ, నాగేంద్రరావు, నరేంద్రకుమార్, జ్యోతి తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత

మణుగూరుటౌన్, జనవరి 20: మండలానికి చెందిన మురళీకృష్ణ ఇటీవల తన సెల్‌ఫోన్ పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మణుగూరు పోలీసులు పోయిన సెల్‌ఫోన్ ఆచూకీ కనిపెట్టి శనివారం బాధితునికి అప్పగించారు. మణుగూరు ఎస్సై శ్రీనివాస్, వీ వెంకన్న పాల్గొన్నారు.

గ్రామసభలు ప్రారంభం

పర్ణశాల, జనవరి 20: మండలంలో పంచాయతీ కార్యాలయాల వద్ద అభివృద్ధి ప్రణాళిక గ్రామసభలు శనివారం ప్రారంభమైనట్లు ఎంపీడీవో ముత్యాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజున 15 పంచాయతీల్లో సభలు జరిగాయని పేర్కొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధంచేయాలి

పాల్వంచ రూరల్, జనవరి 20 : పంచాయతీల అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ సీతారాంనాయక్ అన్నారు. శనివారం తోగ్గూడెం పంచాయతీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొమ్మిది అంశాలతో ప్రణాళికలు సిద్ధం చేస్తే త్వరలో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. సర్పంచ్ బాదావత్ శాంతి, కార్యదర్శి రవి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

దుమ్ముగూడెం, జనవరి 20: మండలంలోని నర్సాపురం గ్రామంలోగల సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం శనివారం హెచ్ఎం కేవీ కాంతారావు అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ రేసులక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ పాల్గొన్నారు. సూదిరెడ్డి నాగిరెడ్డి సోదరుడు వెంకటరమణారెడ్డిని సన్మానించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామవరం, జనవరి 20: రామవరం ఎస్‌సీబీ నగర్‌కు చెందిన మొక్కల వెంకటయ్య కుమారుడు నగేశ్ (45) అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు, లగడపాటి రమేష్‌చంద్, చుంచుపల్లి వైస్ ఎంపీపీ వట్టికొండ మల్లికార్జున్, సాబీర్‌పాషా, తోట రాజు నగేశ్ మృతదేహాన్ని సందరర్శించి నివాళులర్పించారు.

ఇద్దరు పదో తరగతి విద్యార్థుల అదృశ్యం

కొత్తగూడెం క్రైం, జనవరి 20: ఇద్దరు పదో తరగతి విద్యార్థులు అదృశ్యమైన ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం పట్టణంలోని సన్యాసి బస్తీకి చెందిన మౌనిక కుమారుడు కుడుముల ప్రవీణ్ రెడ్డి పోస్టాఫీస్ ఏరియాలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ప్రవీణ్‌రెడ్డి ఈ నెల19(శుక్రవారం) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లాడు. రెండు రోజులు గడుస్తున్నా తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా అశ్వాపురం మండలం చింతిర్యాలకు చెందిన రిమాళి అగస్టీన్ కుమారుడు ఉషోదయ అక్షయ్‌కుమార్ కొత్తగూడెం పట్టణంలోని తెలంగాణ హైస్కూల్ హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల19న విద్యార్థి తల్లిదండ్రులు హాస్టల్‌కి వచ్చారని, వెళ్లి కలిసి వస్తానని స్నేహితులకు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు రెండు రోజులుగా బంధువులు, స్నేహితుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యార్థుల మిస్సింగ్‌పై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై సాయి కిశోర్‌రెడ్డి తెలిపారు.